
తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
12-06-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 125
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# బదిలీలపై స్పష్టత ఏది..?

- రెండు శాఖల్లో వేర్వేరు కారణాలతో నిలిచిన ప్రక్రియ
- ఆర్అండ్ బీ శాఖలో స్థానచలనాలకు బ్రేక్
- 'రైతు డిస్కమ్' వల్లే విద్యుత్ శాఖలో అడ్డంకులు
- జూన్ దాటితే అన్నీ సమస్యలే..
- పరిష్కరిస్తారా? మరో ఏడాది పొడిగిస్తారా?
- ఆందోళనలో ఆయా విభాగాల శ్రేణులు
- సాధారణ బదిలీల గడువు ముగిసినా అంతుచిక్కని వ్యవహారం



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ఇచ్చిన అవకాశం ముగిసి 10 రోజులు కావస్తోంది. అన్నిశాఖల్లో బదిలీలు పూర్తయ్యాయి. కానీ రెండు వేర్వేరు శాఖలలో నిలిచిన బదిలీల మూలంగా ఉద్యోగులు ఇక్కట్లు ఎదుర్కుంటున్నారు. సాధారణ బదిలీల సమయం దాటిపోయి బదిలీలపై నిషేధం ఇప్పటికే ఎత్తివేశారు. అయితే ఆ శాఖల్లో బదిలీలు ఆగడానికి అడ్డొచ్చిన సాంకేతిక సమస్యలు తొలిగితే ప్రభుత్వం బదిలీలకు అవకాశం ఇస్తుందా? లేదా అన్న సందేహం ఆయా శాఖల్లో నెలకొంది.

**రోడ్లు భవనాల శాఖలో..**
సాధారణ బదిలీలలో

మిగతా 2వ పేజీలో..

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం
- ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి
- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్ 11 సిరి న్యూస్:**
దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే

మిగతా 3వ పేజీలో..



# నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్



- తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి
- పోలీసు ఉద్యోగాలకు గతంలో ఉన్న


**హైదరాబాద్, జూన్ 11 :**
ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని అసెంబ్లీలో బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్ రావు మండిపడ్డారు. పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న

మిగతా 2వ పేజీలో..

## విద్యాశాఖలో రూ.2 వేల కోట్ల కుంభకోణం 3

# కవిత టీఆర్ఎస్ పార్టీకి చిక్కులు

- పార్టీ గుర్తింపుపై ఈసీకి అభ్యంతరాలు



**న్యూఢిల్లీ,జూన్ 11 సిరి న్యూస్:**
ఎమ్మెల్సీ కవిత కొత్త రాజకీయ పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు ఊహించని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పేరుపై ఇప్పటికే పలు అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్

మిగతా 2వ పేజీలో..

# బాలికపై లైంగిక దాడి కేసు.. రాజకీయ దుమారం

- నిమ్స్ లో బాధితురాలికి వివిధ పార్టీల నేతల పరామర్శ
- మెరుగైన వైద్యసేవలందించాలని సూచనలు

**ఖమ్మం, జూన్ 11 సిరి న్యూస్:**
ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. కార్ డ్రైవర్ మహ్మద్ గౌస్ (57) లైంగిక దాడికి యత్నించి, ఆ విషయం బయటకు వస్తుందనే భయంతో ఆమెను అపార్ట్‌మెంట్

మిగతా 2వ పేజీలో..



# కాంగ్రెస్‌లో పదవులు అమ్ముకుంటున్నారు!

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆడియో లీక్
- షబ్బీర్ అలీ వర్సెస్ మహేష్ కుమార్ గౌడ్ గా కామారెడ్డి రాజకీయం
- రెండుగా విడిపోయిన కార్యకర్తలు
- ఒకరిపై ఒకరి ఆరోపణలు
- రెండేళ్లుగా ఆధిపత్య పోరు
- గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పీసీసీ కార్యదర్శి ఇవ్వడంతో షబ్బీర్ వర్గం ఆగ్రహం
- రచ్చకెక్కుతున్న రాజకీయాలు
- షబ్బీర్ అలీ ఏకఛత్రాధిపత్యానికి అడ్డుగా మరో వర్గం
- కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా కామారెడ్డి లొల్లి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి షబ్బీర్ అలీతో ఓ కార్యకర్త మాట్లాడిన ఒక ఆడియో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని కుదిపేసింది. 'నాకు పదవి ఇవ్వడం లేదు సర్.. ఏం చేయమంటారు'

మిగతా 3వ పేజీలో..



# మంత్రుల వద్ద ఓఎస్డీల మార్పులు

- ఇంటెలిజెన్స్ నివేదికలతో అప్రమత్తమైన ప్రభుత్వం
- ఒక్కొక్కరుగా విధులకు దూరమవుతున్న కీలక సిబ్బంది
- లీకులు, ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలపై చర్చ

**హైదరాబాద్, జూన్ 11 సిరి న్యూస్:**
తెలంగాణ ప్రభుత్వంలో పలువురు మంత్రులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఓఎస్డీలు, కీలక సిబ్బందిపై కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మంత్రుల వద్ద కొనసాగుతున్న కొందరు ఓఎస్డీలను ఇటీవల ఒక్కొక్కరుగా తప్పించడం లేదా మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన

మిగతా 2వ పేజీలో..




2

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ప్రథమ సంవత్సరంలో 68.84 శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 49.29 శాతం మంది పాస్
- దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థులకు ఫలితాలు

# సుప్రీం కోర్టులో మీనాక్షి నటరాజన్ పిటిషన్

- నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై
- రేపు విచారణ చేపడతామన్న సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 11 సిరి న్యూస్:**
మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన

మిగతా 3వ పేజీలో..





# ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం

- సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తాం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 11 సిరి న్యూస్ :**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో..

# 'సర్ ప్రక్రియపై ఎందుకంత భయం



- దొంగ వోట్లు తొలగిస్తే భయపడాలా
- విపక్షాల తీరుపై మండిపడ్డ బీజేపీ నేత రామచంద్రరావు

**సిద్దిపేట, జూన్ 11 సిరి న్యూస్:**
సర్ ప్రక్రియపై బురదజల్లడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నామయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించా రు. ఎందుకంత భయమో

మిగతా 3వ పేజీలో..



# విజయవంతంగా ముగిసిన బదిలీల ప్రక్రియ 2

ఆరోగ్య శాఖలో 4,869 మంది ఉద్యోగుల బదిలీ

# ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

- భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రవాణా శాఖ మంత్రి పొన్నం వెల్లడి

3



# గ్రేటర్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

కూటమిగా బరిలోకి దిగుతుందా అనే అంశంపై బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో జనసేనకు బీజేపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని కూడా పార్టీ నేతలు గుర్తు చేసుకుంటున్నారని సమాచారం. ఒకవేళ బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై బీఆర్ఎస్ నేతలు లెక్కలు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణ ప్రయోజనాల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలనే ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల మీడియాతో మాట్లాడిన కేటీఆర్, జనసేన గతంలో కూడా తెలంగాణలో పోటీ చేసిందని గుర్తు చేశారు. ఆ వ్యాఖ్యల ద్వారా జనసేన ఒంటరిగా వచ్చినా, కూటమిలో భాగంగా వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ప్రస్తుతం బీజేపీ, జనసేన, టీడీపీలు తెలంగాణలో కూటమిగా పోటీ చేస్తామని ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయినప్పటికీ భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ముందస్తు వ్యూహాలపై కసరత్తు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రేటర్ ఎన్నికలను వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా మలచాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో గులాబీ పార్టీ ఎలాంటి రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

# బదిలీలపై స్పష్టత ఏది..?



మొదటిపేజీ తరువాయి

రోడ్లు భవనాల శాఖకు సంబంధించి బదిలీలు జరగలేదు. ఇందుకు కారణం ఆ శాఖలో ఉద్యోగులకు ప్రమోషన్ ఇచ్చిన తర్వాతే బదిలీలు చేయాలన్న మంత్రి సంకల్పమే. ఆ శాఖలో సాధారణ బదిలీలకు ముందే పదోన్నతులు చేయాలని మంత్రి సంకల్పించారట. అందుకు దగ్గట్టే పదోన్నతుల ప్రక్రియ సైతం పూర్తయ్యింది కానీ ఆ శాఖలోని హ్యామ్ విభాగానికి అధికారుల కేటాయింపులో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయట. దీంతో బదిలీల ప్రక్రియకు ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఆ శాఖలో మూడు వేల పైచిలుకు ఉద్యోగులకు ఆ సమస్య మూలంగా బదిలీ కాకుండా పోయింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీల ప్రక్రియ ఇలా ఆగిపోవడం మూలంగా వివిధ రకాల బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు నిరాశే ఎదురయ్యింది.

**రైతు డిస్కమ్ వల్ల విద్యుత్ శాఖలో..**

తెలంగాణాలోని విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు కొత్తగా ఏర్పాటు కానున్న రైతు డిస్కమ్ అడ్డంకిగా మారింది. డిస్కమ్, జెన్కో, ట్రాన్స్కో లలో కలిపి 50 వేల పైచిలుకు ఉద్యోగులుండగా అందులో 50 శాతానికి మించకుండా బదిలీ చేయాలనీ అందులో కనీస సర్వీస్ 3 ఏళ్లుగా ఉండేలా చుడాలని యాజమాన్యం నిబంధలను సైతం విధించింది. అయితే బదిలీల నిషేధం ఎత్తివేసి ముగించే లోపే కొత్త డిస్కమ్ ప్రారంభం అవుతుందని అందరు బావించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సైతం జూన్ 2న ప్రారంభిస్తామని చెప్పారు. కానీ ఆ డిస్కమ్ ఏర్పాటుకు ముందే ప్రజలనుండి అభ్యంతరాలు రావడంతో ఈఆర్సి లైసెన్స్ మంజూరీ చేయలేదు. దీంతో విద్యుత్ శాఖలో కొత్తగా ఏర్పడుతుందన్న డిస్కమ్ లోకి ఉద్యోగుల బదిలీ సాధ్యం కాలేదు.

**మరిన్ని రోజులు వేచి చూడాల్సిందేనా?**

తెలంగాణలోని విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీకి మరిన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. ఇందుకు కారణం కొత్త డిస్కమ్ ఏర్పాటులో తలెత్తిన అంశాలపై సవరణలు చేయనున్నట్టు ఆ సంస్థ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేయడంతో మళ్లీ డిస్కమ్ ఏర్పాటుపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు మొదలు పెట్టినట్టు అర్థమవుతోంది. దీంతో కొత్త డిస్కమ్ ఏర్పాటు చేశాక, ప్రస్తుత సంస్థలనుండి ఉద్యోగుల బదిలీ జరుగుతుందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాతే విద్యుత్ శాఖలో బదిలీలకు అవకాశం ఉండొచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా సాధారణ బదిలీల్లో వేర్వేరు కారణాలతో బదిలీలకు నోచుకోకుండా ఎదురుచూస్తున్న రోడ్లు భవనాల శాఖ ఉద్యోగులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు మాత్రం బదిలీలు జరగక తీవ్ర నిరాశతో ఉన్నారు. ఆ శాఖ ఉద్యోగులకు తీపి కబురు అందించే దిశగా ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పిస్తుందని వేచిచూస్తున్నారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 11 సిరి న్యూస్:**

తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి ప్రకటించింది.ఈ ఏడాది నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 3,98,498 మంది విద్యార్థులు హాజరయ్యారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులతో పాటు మార్కులు మెరుగుపర్చుకోవడానికి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఉన్నత విద్య ప్రవేశాలు, కౌన్సెలింగ్ ప్రక్రియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యామండలి వేగంగా ఫలితాలను వెల్లడించింది.

ప్రథమ సంవత్సరం పరీక్షలకు 2,67,331 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 1,84,042 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉత్తీర్ణత శాతం 68.84గా నమోదైంది. గత ఫలితాలతో పోలిస్తే గణనీయ సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించారు.

ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,31,128 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 64,639 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ విభాగంలో ఉత్తీర్ణత శాతం 49.29గా నమోదైంది.

ఫలితాల విడుదలతో విద్యార్థులు తమ తదుపరి విద్యా ప్రణాళికలపై దృష్టి సారించనున్నారు. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

# నిరుద్యోగ యువతను మోసం చేసిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగ యువత ఆయనను గురువారం కలిసి నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు. నిరుద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆరఎస్ హయాంలో పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి ఒకేసారి 16 వేలు, 17 వేల చొప్పున నోటిఫికేషన్లు ఇచ్చామని, పోలీస్ శాఖలో దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 19వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి, డీజీపీ చెబుతూనే కేవలం ఐదు వేల ఉద్యోగాలతోనే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. తక్షణమే మొత్తం 19 వేల ఖాళీల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తే అందులో రెండు వేలు హైదరాబాద్ పరిధిలోకే వెళ్లిపోతాయని, మిగిలిన పోస్టుల్లో గ్రామీణ ప్రాంతాలకు, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో కులానికి ఒక్క పోస్టు కూడా దక్కదని, దీనివల్ల గ్రామీణ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుదించిన వయో పరిమితిని రద్దు చేసి బీఆరఎస్ హయాంలో ఉన్నట్లు కానిస్టేబుల్‌కు 36, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈవెంట్స్‌లో కూడా నిబంధనలు కఠినతరం చేయడం పట్ల హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆరఎస్ ప్రభుత్వంలో ఐదు ఈవెంట్లలో మూడింటికి అర్హత సాధిస్తే సరిపోయేదని, కానీ ఇప్పుడు లాంగ్ జంప్, షాట్‌పుట్‌లలో దూరం పెంచి మూడింటికి మూడు క్వాలిఫై కావాలనడం అన్యాయమన్నారు. వెంటనే పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో జాబ్ అప్లికేషన్లకు ఫీజు ఉండదని హామీ ఇచ్చి ఇప్పుడు భారీగా ఫీజుల వసూలు చేస్తూ నిరుద్యోగుల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు తక్షణం అప్లికేషన్ ఫీజు లేకుండా స్వీకరించాలని డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్ నగర్, అశోక్ నగర్ లాంటి ప్రాంతాల్లో వేలాదిమంది అభ్యర్థులు సన్నద్ధమవుతున్నా ఈవెంట్స్ ప్రాక్టీస్ కోసం సరైన గ్రౌండ్స్ లేవని, కొంతసమయంపాటు సమీపంలోని పోలీసు లేదా ఇతర గ్రౌండ్స్ కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆరఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 19 వేల పోస్టులతోపాటు మేనిఫెస్టోలో చెప్పిన రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సాధించేదాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హరీశ్ రావు నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారు.



## కవిత టీఆర్ఎస్ పార్టీకి చిక్కులు

మొదటిపేజీ తరువాయి

కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన కూడా టీఆర్ఎస్ పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. షోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌ద్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక కవిత పార్టీ పేరుపై భారత్ రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో టిఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రాణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది. అంతేకాక పత్రికల్లో కవిత ఇచ్చిన ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. టీఆర్ఎస్ పేరును కేటాయించడంపై దాదాపు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే ఈ పేరుతో నమోదైన మరికొన్ని పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రాజ్య సమితి పేరుతో నమోదైన మరో పార్టీ కూడా టీఆర్ఎస్ పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు దక్కుతుందా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# మంత్రుల వద్ద ఓఎస్డీల మార్పులు

మొదటిపేజీ తరువాయి

కీలక సమాచారం బయటకు వెళ్లడం, కొందరు సిబ్బందిపై ఫిర్యాదులు రావడం వంటి అంశాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. మంత్రుల వద్ద పనిచేసే అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వివరాలను ఇంటెలిజెన్స్ విభాగాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ నివేదికల ఆధారంగానే కొందరు మంత్రులు తమ సిబ్బందిలో మార్పులు చేసినట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో మంత్రి కొండా సురేఖ వద్ద ఓఎస్డీగా పనిచేసిన సుమంత్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అనంతరం ఆయనను విధుల నుంచి తప్పించారు. అప్పటి నుంచి ఆ పోస్టును భర్తీ చేయలేదని సమాచారం. మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీలక్ష్మి ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్యాలయంలో పనిచేసిన ఓఎస్డీ యుగంధర్ విధులకు దూరం కాగా, కొద్ది రోజుల తర్వాత పీఎస్ చంద్రమోహన్ కూడా బాధ్యతలు వీడారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వద్ద పీఎస్‌గా ఉన్న పురుషోత్తం రెడ్డి ఇటీవల తప్పుకున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద ఓఎస్డీగా కొనసాగిన పాక రమేష్ కూడా విధులు మానేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్ద ఓఎస్డీగా పనిచేసిన సురేందర్ రెడ్డి మరో శాఖకు బదిలీ అయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వద్ద ఓఎస్డీగా పనిచేసిన రాజేందర్ నామినేటెడ్ పదవికి నియమితులయ్యారు. ఇలా పలువురు మంత్రుల కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన అధికారులు, సిబ్బంది మారడం చర్చకు దారితీసింది. అధికారికంగా వ్యక్తిగత కారణాలతోనే కొందరు బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు చెబుతున్నప్పటికీ, అంతర్గతంగా ఇతర కారణాలు కూడా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. కొందరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు రావడం, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతోనే మంత్రులు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# బాలికపై లైంగిక దాడి కేసు.. రాజకీయ దుమారం

మొదటిపేజీ తరువాయి

ఐదో అంతస్తు పైనుంచి కిందకు తోసేశాడు. దీంతో పేద బాలిక వెన్నెముక, పక్కటెముకలు విరిగి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమె కు ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందజేస్తున్నారు. పలు రాజకీయ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు గురువారం నిమ్స్ బాట పట్టారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితిని చూసి చలించిపోయారు. నిమ్స్ డైరెక్టర్ రాహుల్ తో మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్య చికిత్సల వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఎటువంటి పరిస్థితి ఎదురైనా ముందు తనకు తెలియజేయాలని మంత్రి సూచించారు. బాలిక తల్లిదండ్రులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు తాను అండగా ఉంటానని ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల సహాయం అందిస్తానని తెలిపారు. అక్కడ ఉన్న ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడిన తుమ్మల బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘటన జరిగిన రోజున ఫోన్ లో బాధిత కుటుంబంతో మాట్లాడారు.

**మాజీ మంత్రి హరీష్ పరామర్శ**

మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి బాధిత బాలికను పరామర్శించారు. నిమ్స్ వైద్యులతో



మాట్లాడి బాలిక ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదా ? చిన్న పాపకు కనీసం ఉచితంగా మందులు అందించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. బాధిత కుటుంబం నిమ్స్ ఆసుపత్రి సమీపంలో మందులు కొనుగోలు చేస్తున్నదని ఆ బిల్లులను చూయించారు. ఖమ్మంలో ప్రభుత్వ ఆసుపత్రి చేర్చుకోకపోవడంతో ప్రైవేటులో రూ.40 వేల అప్పు చేసి ఖర్చు చేసుకున్నారు. నిమ్స్ కు వస్తే ఇక్కడా ప్రభుత్వ డాక్టర్లు మందులు బయట కొనుక్కోమని చెప్పడం ప్రభుత్వ అమానవీయ తీరుకు నిదర్శనమని మండిపడ్డారు.

**బీజేపీ నేతల పరామర్శ**

బాధితురాలిని బీజేపీ రాష్ట్ర నాయకుల బృందం పరామర్శించింది. ఈ బృందంలో రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ప్రభారీ బద్దం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,రాష్ట్ర అధికార ప్రతినిధులు వాకధాని పుల్లారావు యాదవ్,నంబూరి రామ లింగేశ్వరరావు తదితరులు ఉన్నారు. నేరుగా ఆసుపత్రికి చేరుకున్న వీరు బాలిక పరిస్థితిని చూసి తీవ్రంగా చలించిపోయారు. అభం శుభం తెలియని పసికందు రెండు చేతులు విరిగిపోయి, తిరిగి నడవలేని దీనస్థితిలో ఉండటం హృదయ విదారకమని, ఆ పాప తిరిగి సాధారణ స్థితికి రావడం కష్టమని వైద్యులు చెబుతుండటం అత్యంత బాధాకరమని అన్నారు. నిమ్స్ వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలిక ప్రాణాలను కాపాడేందుకు ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి పార్టీ అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించారు. ఇంత ఘోరం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత అమానవీయంగా ఉందని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఆ పేద కుటుంబానికి కనీస పట్టింపు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారంటే వంద మంది పోలీసులను మోహరించడంపై ఉన్న శ్రద్ధ ఆ పసిపాపకు ఉచితంగా మందులు ఇప్పించడంపై ప్రభుత్వానికి లేకపోవ

# విజయవంతంగా ముగిసిన బదిలీల ప్రక్రియ

**హైదరాబాద్, జూన్ 11 సిరి న్యూస్:**

రాష్ట్ర ఆరోగ్య శాఖలో భారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యతను కాపాడుతూ ప్రభుత్వం 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగులను బదిలీ చేసింది. ఈ బదిలీల్లో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 2,258మంది బదిలీ అయ్యారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరించారు. త్వరలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ హాస్పిటళ్లలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎనఎంసీ) తనిఖీలు ప్రారంభంకానున్ననేపథ్యంలో ప్రభుత్వం బదిలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. ఎనఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి మెడికల్ కాలేజీలో అవసరమైన సంఖ్యలో అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా బదిలీలను నిర్వహించింది. అదే సమయంలో ఒకే హాస్పిటల్ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఒకేసారి బదిలీ చేస్తే రోగులకు అందే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని గుర్తించి బదిలీల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేసింది. ఒకే స్టేషన్‌లో నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీకి అవకాశం కల్పించింది. అంతకు తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పిస్తే జిల్లాల్లోని హాస్పిటల్స్‌లో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ విషయంలో గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. ప్రస్తుతం జిల్లాల స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను, జిల్లా కేంద్రాల్లోని టీచింగ్ హాస్పిటళ్లను ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. దాదాపు 90 శాతం వైద్య సేవలను జిల్లాస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను పెంచుతోంది. ఈ వ్యూహంలో భాగంగా ఇటీవల నియామకాలు పొందుతున్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందికి కూడా గ్రామీణ, జిల్లాస్థాయి వైద్య సంస్థల్లోనే పోస్టింగులు ఇస్తోంది. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లోని ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు రవాణా, ఇతర ఖర్చుల భారం ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లోనే అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా, వైద్య సేవల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించడం ద్వారా రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసిందని ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఎర్రమంజిల్ జలసౌధలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ సీ□తారామ ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని, పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మున్నేరు పాలేరు అనుసంధానం ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరం అంటూ విద్యుత్ ఖర్చు లేకుండా గురుత్వాకర్షణ పద్ధతిలో నీటి మళ్లింపు ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ప్రాజెక్టుకు గడువులు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామHని, ఖమ్మంను అభివృద్ధి చెందిన వ్యవసాయ జిల్లాగా తీర్చిదిద్దుతామని, ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక కార్యాచరణ : మంత్రి పొంగులేటి**



మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులతోపాటు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల విడుదల వంటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ప్రాజెక్టుల పూర్తి దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని, పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు పాత ఆయకట్టును స్థిరీకరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి విస్తరణే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రధాన లక్ష్యాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం అవసరమైన ప్రతి ప్రాజెక్టునూ పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

మొదటిపేజీ తరువాయి



దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని సీఎం చెప్పారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

**తెలంగాణలో విద్య-నైపుణ్యాభివృద్ధి విప్లవం**

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గత 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందని అన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తమ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీని రాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐటీ, ఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

**రాష్ట్ర ప్రాజెక్టులకు సహకరించాలి : ప్రధానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి**

రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఫేజ్2లో 7 కారిడార్లలో 122.9 కి.మీ మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్రం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ అమరావతిబందర్ పోర్టు ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వేతో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టు పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానితో ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఎయిర్ పోర్టు అథారిటీకి అప్పగించామని తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం2020 ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు.

# విద్యాశాఖలో రూ.2 వేల కోట్ల కుంభకోణం

- అప్పులు తేవడానికి దళారులను పెట్టుకున్న ప్రభుత్వం
- రాష్ట్రం ఇచ్చిన కమీషన్లతో విమానం కొన్న ముంబై బ్రోకర్
- ఫార్మా సిటీ రద్దుతో ఏపీకి తరలిశ్రీ పెట్టుబడులు
- కాంగ్రెస్ పాలకులపై బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ధ్వజం



హైదరాబాద్, జూన్ 11 సిరి న్యూస్ :

కమీషన్ల కోసం కాంట్రాక్టులు కుదరకపోవడం వల్లే బడుల ప్రారంభాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వాయిదా వేశారని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో చిట్ చాట్ మాట్లాడారు. ఏటా జూన్ 12న తెరవాల్సిన స్కూళ్లను 15వ తేదీకి ఎందుకు వాయిదా వేశారంటూ దీని వెనుక రూ.2 వేల కోట్ల భారీ కుంభకోణం దాగి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకులాలు, ప్రభుత్వ బడుల్లో యూనిఫామ్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్‌క్యాప్‌కు ఇస్తే రేవంత్ రెడ్డి వాటిని సెంట్రలైజ్ చేసి గుజరాత్ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాడని ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని తెలిపారు. ఏడు లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, నోట్ బుక్స్ ఏవీ ఇంకా అందలేదన్నారు. అన్యాయం జరిగిందని చేనేత సంస్థలు కోర్టుకు కూడా వెళ్లాయని, విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆయన విమర్శించారు. సీఎం కనుసన్నల్లో రేట్లు డబుల్ చేసి మరీ టెండర్లు ఫైనల్ చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల సంఖ్య దారుణంగా తగ్గిపోయిందని సాక్షాత్తూ కేంద్రమే నివేదిక ఇస్తే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి యూకేజీ అని కట్టుకథలు చెబుతున్నారన్నారు. బడుల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలే కావడం లేదు. అమ్మ ఒడి కమిటీల ద్వారా పనులు చేసిన మహిళా సంఘాలకు, పేదలకు ఒక్కో నియోజకవర్గానికి రూ.4 కోట్ల చొప్పున బిల్లులు పెండింగ్ పెట్టారు.. బడుల్లో పనిచేసే స్కావెంజర్లకు సైతం నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదు అని హరీష్‌రావు వెల్లడించారు.

**అప్పులు తేవడానికి దళారులు**

ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి వేల కోట్ల అప్పులు తేవడానికి ఈ ప్రభుత్వం ఏకంగా దళారులను పెట్టుకుందన్నారు. అప్పులు ఇప్పించినందుకు ఆ బ్రోకర్లకు వందల కోట్లు కమీషన్లుగా దోచిపెడుతున్నారని, కమీషన్లు ముట్టజెప్పగానే ముంబైకి చెందిన ఆ బ్రోకర్ ఏకంగా ఓ విమానమే కొనుక్కున్నాడని తెలిపారు.

**పెంచిన భూముల ధరలతో ఇబ్బందులు**

అడ్డగోలుగా పెంచిన భూముల ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైందని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని ఎసఎఫ్‌టీల వరకు తక్కువ ధరలు నిర్ణయిస్తే ఇక్కడ మాత్రం ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పన్నుల మీద పన్నులు వేస్తూ పేదల నడ్డి విరుస్తోందని, ఆర్టీయే చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, మద్యం ధరలు ఇప్పటికే పెంచారు.. ఇప్పుడు మందుల ధరలు కూడా పెంచబోతున్నారని తెలిపారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు భూమి శిస్తు కూడా తెస్తామని ముఖ్యమంత్రి అంటున్నాడన్నారు.

**మీనాక్షి వెనుక పెద్ద కుట్ర**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక సొంత పార్టీ నేతల కుట్రే దాగి ఉందని హరీష్‌రావు వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఆశించిన రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తే ఈ వెన్నుపోటుకు పాల్పడినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. గతంలో ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకున్న వ్యక్తే ఇప్పుడు ఈ కుట్ర చేశాడన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి సిట్‌తో విచారణ చే□స్తాడా.. లేక ఇంకేదైనా విచారణ చేస్తాడా అని నిలదీశారు.

**విలాసవంతమైన గెస్ట్ హౌస్‌లు కట్టుకుంటున్నాడు**

సెక్రటేరియట్‌కు వెళ్లని రేవంత్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తన క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నాడని, ఇప్పుడు ఫ్యూచర్ సిటీలో మరో క్యాంపు కార్యాలయం కట్టుకుంటున్నాడని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో తన నివాసానికి కొద్ది దూరంలోనే ఏకంగా రూ.100 కోట్లతో బోధి పెవిలియన్ పేరుతో విలాసవంతమైన గెస్ట్ హౌస్ కట్టుకుంటున్నాడని, అర్ధరాత్రిపూట సతీసమేతంగా వెళ్లి పనులను పర్యవేక్షిస్తున్నాడని, మొదట వీవీఐపీ గెస్ట్ హౌస్ పేరుతో రూ.7 కోట్లతో జీవో ఇచ్చి దాన్ని రూ.100 కోట్లకు పెంచారని ఆరోపించారు. దాని చుట్టూ రూ.17 కోట్లతో ఇనుప కంచెలు, ఫుట్‌బాల్ ఆట కోసం రూ.10 కోట్లతో స్టేడియం నిర్మిస్తూ ముఖ్యమంత్రి సోకులు పోతున్నాడని వ్యాఖ్యానించారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో తన సొంతానికి మూడో క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్నాడన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు, రైతులకు సాయం చేయడానికి ఖజానాలో డబ్బులు లేవంటున్న ప్రభుత్వానికి వందల కోట్లతో గెస్ట్ హౌస్‌లు కట్టుకోవడానికి నిధులు ఎక్కడినుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ఇక మొన్నటి వరకు నెలకు రూ.2 కోట్ల అద్దెతో తిరిగిన హెలికాప్టర్ స్థానంలో ఇప్పుడు నెలకు ఏకంగా రూ.5 కోట్లు వెచ్చించి మరీ కొత్త హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి షికార్లు చేస్తున్నాడన్నారు.

**పెట్రోల్‌పై రాష్ట్ర పన్నులు తగ్గించాలి**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ఈ ప్రభుత్వానికి అదనంగా రూ.2 వేల కోట్ల ఆదాయం రాబోతోందని హరీష్‌రావు తెలిపారు. కేంద్రం పెంచిందని ధర్నాలు చేసే బదులు అనేక రాష్ట్రాలు తగ్గించినట్లు ఇక్కడ స్టేట్ ట్యాక్స్ తగ్గించాలని సీఎంను హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ అని గొప్పలు చెబుతున్న ఆ ప్రాజెక్టు ఇప్పుడు అక్కడి చుట్టుపక్కల గ్రామాలకు ఓ శాపం కాబోతోందన్నారు. హెచ్ఎండీఏ ద్వారా అప్పులు తేవడమే కాక రెగ్యులర్ ట్యాక్స్‌తోపాటు కొత్తగా టోల్ గేట్లు పెట్టి మరీ అడిషనల్ ఇంపాక్ట్ ఫీజు పేరుతో ప్రజల జేబులు గుల్ల చేయబోతున్నారని తెలిపారు.

# ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

సిద్దిపేట, జూన్ 11 సిరి న్యూస్:

రాబోయే గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామన్నారు. పుష్కరాలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని చెప్పారు.

నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్ లేన్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని, డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం గురువారం పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పారు. హుస్నాబాద్ బస్టాండ్‌ను పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

# కాంగ్రెస్ లో పదవులు అమ్ముకుంటున్నారు!

మొదటిపేజీ తరువాయి





అంటూ మహేందర్ రెడ్డి అనే కార్యకర్త మాజీ మంత్రి, ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్ అలీతో ఆవేదన వ్యక్తం చేయగా.. 'కాంగ్రెస్ పార్టీలో డబ్బులకు పదవులు అమ్ముకుంటున్నారు..' అని అన్న మాటలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఒక సీనియర్ నేత మాజీ మంత్రి, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ ఆలా అనడం సమంజసమా? అనే వాదన వినిపిస్తుంది. అయితే మరో వైపు కార్యకర్తకు తన అనుయాయునికి జరిగిన అన్యాయాన్ని సహించలేకే ఆ సందర్భంలో ఆలా అని ఉంటాడని ఆయన వర్గీయులు వాపోతున్నారు.

**అసలేం జరిగింది..**

కామారెడ్డి నియోజకవర్గంలో షబ్బీర్ అలీ 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఏకైక నాయకుడు. తన రాజకీయ చతురతతో కామారెడ్డిలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నాడు. అయితే గత ఎన్నికల సందర్భంగా ఇక్కడినుండి పోటీచేయాల్సిన షబ్బీరే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రాకతో తప్పుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో రేవంత్ రెడ్డికి అనుకూలంగా టీఆర్ఎస్ లోని షబ్బీర్ అలీ వ్యతిరేక వర్గం కాంగ్రెస్ లో చేరింది. ఆ ఎన్నికలో రేవంత్ రెడ్డి ఓటమి పాలైనప్పటికీ రేవంత్ గెలుపుకోసం కృషిచేసిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. పదవుల పంపిణీలో సైతం ఆయన వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల షబ్బీర్ అలీ వర్గానికి కొంత అన్యాయం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు తోడు గత మున్సిపల్ ఎన్నికల్లో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో 12 టిక్కెట్లు దక్కాయట. అయితే ఆ అభ్యర్థులను ఓటమి పాలు చేయడంలో షబ్బీర్ వర్గం విజయం సాధించింది. కొందరు అభ్యర్థుల ఓటమికి కృషిచేశారంటూ షబ్బీర్ అలీపై చంద్రశేఖర్ రెడ్డి పీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసారు. దీంతో కామారెడ్డి కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒక వర్గానికి షబ్బీర్ మరో వర్గానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సహకరిస్తున్నారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

**ఆడియోలో ఏముంది?**

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పీసీసీకి కార్యదర్శుల నియామకం జరిగింది. దానికోసం చంద్రశేఖర్ రెడ్డితో పాటు షబ్బీర్ అనుచరుడు మహేందర్ రెడ్డి పోటీపడ్డారు. ఇటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆశీస్సులతో గడ్డం చంద్ర శేఖర్ రెడ్డి ఆ పదవిని దక్కించుకున్నారు. అదే విషయాన్ని తన నాయకుడితో పంచుకున్న తరుణంలో కార్యకర్త భావోద్వేగాన్ని విని షబ్బీర్ అలీ అన్న మాటలే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో పెద్ద తుఫాన్ సృష్టించాయి.

# 'సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

మొదటిపేజీ తరువాయి



చెప్పాలన్నారు. దొంగోట్లను తొలగించడం ఎన్నిక లసంఘం విధి అన్నారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు బీజేపీ మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో రామచందర్‌రావు మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. వోటు హక్కు ఉన్న ప్రాంతంలోనే వోటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతోపాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. వోటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఐఆర్ పక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

# సుప్రీం కోర్టులో మీనాక్షినటరాజన్ పిటిషన్

మొదటిపేజీ తరువాయి

క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక పక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీం కోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షీ నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఝలక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు. 2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షీపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేదీ. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జ్ గా ఉన్నారు.

**మీనాక్షిపై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు : మహేష్ కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ : రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళ అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహించారు. ఢిల్లీ వేదికగా గురువారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని అన్నారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో బతుకుడే కష్టంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతూ పోతున్నాయని, పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఒక్క రాజ్యసభ సీటు కోసం ప్రధాని స్థాయి కుట్రలా?

- మీనాక్షి నామినేషన్ తిరస్కరణ వెనుక మోడీ హస్తం
- ఈసీ వ్యవస్థను వాడుకుని బీజేపీ గలీజ్ రాజకీయం
- హరీష్ రావు మాటలకు అసలు తాడు బొంగరం లేదు
- బీజేపీ, హరీష్ రావుపై జగ్గారెడ్డి తీవ్ర ధ్వజం




**హైదరాబాద్, సిరి న్యూస్:**

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గాంధీ ఐడియాలజీతో పనిచేసే ఒక సాదాసీదా మహిళా నేతను అడ్డుకోవడానికి ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయం ఇంత దుర్మార్గంగా, దిగజారుడు రాజకీయం చేయడం దౌర్భాగ్యమన్నారు. ఒక చిన్న కేసును సాకుగా చూపి, ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని బీజేపీ రాష్ట్రాలను కబ్జా చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. 12 ఏళ్ల మోదీ పరిపాలనలో కుట్రలు తప్ప నీతివంతమైన పాలన ఎక్కడా లేదని జగ్గారెడ్డి విమర్శించారు. కోట్లాది ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం తెస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని నిలదీశారు. బీజేపీ నాయకులకు నిజంగా మగతనం ఉంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అంతేగానీ ఇలా షార్ట్‌కట్ పద్ధతుల్లో, దొంగతనంగా రాజ్యసభ స్థానాలను లాక్కోవడం కాదని సవాల్ విసిరారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ దొంగతనం చేస్తే, ఆ బురదను ఇక్కడ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై జల్లడానికి హరీష్ రావు ప్రయత్నిస్తున్నారని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావు మాటలకు తాడు బొంగరం లేదని, నాడు అధికారం ఉన్నప్పుడు మామ సంకలో ఉండి, నేడు రోడ్ల మీద పడ్డారని ఎద్దేవా చేశారు. నీతిమాలిన చర్యకు పాల్పడిన బీజేపీని ప్రశ్నించకుండా కాంగ్రెస్‌ను విమర్శించడం హరీష్ రావు దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారంటూ బీజేపీ ఆడుతున్న డ్రామాలను ఎవరూ నమ్మవద్దని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. తాను చేసిన దొంగతనంపై చర్చ జరగకుండా ఉండేందుకే బీజేపీ ఈ కోవర్ట్ డ్రామాలను తెరపైకి తెచ్చిందన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా కోవర్టులుగా మారి సొంత పార్టీకే నష్టం చేయాలని చూస్తే వారి తోడ్కలు తీస్తాం అని జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

# కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


**అక్బర్‌పేట-భూంపల్లి, జూన్ 11, (సిరి న్యూస్):**
నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 594 మంది లబ్ధిదారులకు రూ.5.94 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో సుమారు పదివేల ఇళ్లను మంజూరు చేయగా వాటిలో 80 శాతం గ్రౌండింగ్ పూర్తైందని, 5 వేల ఇళ్లకు స్లాబ్‌లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఏడాది కూడా కొత్త ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు ఉచిత కరెంట్ అందిస్తు న్నామని, ఇందుకోసం ఇప్పటివరకు రూ.158 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం జిల్లాలో ఆర్టీసీకి రూ.300 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో 45 వేలకుపైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు కుటుంబ సభ్యుల పేర్లను చేర్చామని, ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారుడికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించామని చెప్పారు. కొత్త పింఛన్ల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించామని, త్వరలో వాటిని అమలు చేస్తామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 56 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించామని, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. యూరియా, డీఏపీ కొరత లేదని, రైతులు ఆధునిక యాప్‌ల ద్వారా ఎరువులను సులభంగా కొనుగోలు చేయవచ్చని సూచించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ దేశంలోనే అత్యుత్తమ సంక్షేమ పథకాలలో ఒకటని అన్నారు. మల్లన్నసాగర్ మెయిన్ కెనాల్ పనులు పూర్తయ్యాయని, సబ్ కెనాల్ భూసేకరణ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దుబ్బాక నియోజకవర్గంలో గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 27 ఎకరాల్లో ప్రతిపాదించిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు వెంటనే అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సంగీత రవీందర్, ఆర్డీవో సదానందం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వరిలో వెదసాగు, సమతుల్య ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 11,సిరి న్యూస్:**
తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్ధిపేట ఆధ్వర్యంలో దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ గ్రామంలో వరిలో వెదసాగు, సమతుల్య ఎరువుల యాజమాన్యంపై గురువారం శాస్త్రవేత్తలు, రైతుల చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ అండ్ శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ పల్లవి మాట్లాడుతూ వ్యవసాయంలో కూలీల కొరత మరియు పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించేందుకు రైతులు వరిలో వెదసాగు పద్ధతిని అనుసరించాలని సూచించారు. సాంప్రదాయ నారు నాటే విధానానికి భిన్నంగా మొలకెత్తించిన విత్తనాలను బురదగా తయారుచేసిన పొలంలో డ్రమ్ సీడర్ ద్వారా నేరుగా విత్తడం వల్ల నారు పెంపకం, పీకడం, నాట్లు వేయడం వంటి పనులు అవసరం ఉండవని తెలిపారు. ఈ పద్ధతితో కూలీల అవసరం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు తగ్గుతాయని, 15 నుంచి 20 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చని చెప్పారు. అలాగే పంట 7 నుంచి 10 రోజుల ముందుగానే కోతకు రావడం వల్ల తదుపరి పంటను త్వరగా సాగు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూసారాన్ని కాపాడుకోవడానికి సమతుల్య ఎరువుల వినియోగం అవసరమని డాక్టర్ పల్లవి తెలిపారు.

## సంపాదకీయం

# పూజలందుకొనే గోమాతకు ప్లాస్టిక్ ఉరితాడు!




భారతీయ సంస్కృతి, జీవన విధానంలో గోవుకు అత్యంత విశిష్టమైన స్థానముంది. ముక్కోటి దేవతల నిలయంగా, సాక్షాత్తూ లక్ష్మీ స్వరూపంగా గోమాతను మనం ఆరాధిస్తాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఆవును కేవలం ఒక జంతువులా కాకుండా, కుటుంబంలో ఒక సభ్యురాలిగా చూసుకోవడం మన సంప్రదాయం. ఉదయం లేవగానే ఆవుకు ప్రదక్షిణలు చేసి, తిలకం దిద్ది, తోటకూర, అరటిపండ్లు తినిపించే భక్తులు కోట్లాది మంది ఉన్నారు. కానీ అదే గోమాత నేడు నడిరోడ్డుపై ప్లాస్టిక్ మహమ్మారి కాటుకు గురై విలవిలలాడుతుంటే సమాజం మూగప్రేక్షకుడిగా మిగిలిపోవడం అత్యంత విచారకరం. ఒకవైపు గోవును దేవతగా పూజిస్తూనే, మరోవైపు మన నిర్లక్ష్యంతో దాని నోటికి ప్లాస్టిక్ ఉరితాడు బిగిస్తు న్నామా అనే నైతిక ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరినీ వేధించాల్సిన సమయం వచ్చింది. ఆధునిక మానవ జీవన శైలిలో ప్లాస్టిక్ ఒక అనివార్య శాపంగా మారింది. పట్టణాలు, నగరాల నుండి పల్లెల దాకా ప్లాస్టిక్ కవర్ల (క్యారీ బ్యాగులు) వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. హోటళ్లు, ఇళ్లు, కూరగాయల మార్కెట్లలో మిగిలిపోయిన అన్నం, కూరలు, కుళ్లిన పండ్లను ప్లాస్టిక్ కవర్లలో గట్టిగా ముడివేసి రోడ్లపై, డస్ట్‌బిన్ల పక్కన పారేయడం మనకు నిత్యకృత్యంగా మారింది. ఆకలితో అలమటించే మూగజీవాలకు ఆ కవర్లను విప్పి, లోపల ఉన్న ఆహారాన్ని మాత్రమే తినే విచక్షణ, నైపుణ్యం ఉండవు. కవర్ల లోపల నుండి వచ్చే ఆహార వాసనకు ఆకర్షితమై, అవి ఆ విషపూరిత ప్లాస్టిక్‌ను సైతం ఆహారంతో పాటు మింగేస్తున్నాయి.

**ఆవుల కడుపులో 35 - 75 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు...**

ఇలా రోజూ తింటున్న ప్లాస్టిక్ ఆవుల జీర్ణకోశంలో పేరుకుపోతుంది. ప్లాస్టిక్ ఎప్పటికీ కరిగిపోని వ్యర్థం కావడం వల్ల, అది జీర్ణాశయంలో రాయిలా గడ్డకట్టుకుపోతుంది. పశువైద్యుల నివేదికల ప్రకారం, నగరాల్లో అనారోగ్యంతో మరణిస్తున్న ఆవుల కడుపులో 30 నుండి 75 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు, బ్లేడ్లు, పిన్నులు బయటపడుతున్నాయి. ఈ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల ఆవులు తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడతాయి. ఆహారం తీసుకోలేక, పాలు ఇవ్వలేక, శ్వాస ఆడక, చివరికి మలమూత్ర విసర్జన కూడా చేయలేని దయనీయ స్థితిలో విలవిలలాడుతూ దేశంలో ప్రతిరోజూ వందలాది ఆవులు మృత్యువాత పడుతున్నాయి. పశువైద్యులు అత్యవసర ఆపరేషన్లు చేసి ఆవుల కడుపుల నుండి కొండలలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలను తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చూసినప్పుడైనా మన అంతరాత్మ ఎందుకు ప్రబోధించడం లేదు? ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, మానవ నైతికతకు పట్టిన శేషం. ఒకవైపు గోసంరక్షణ, గోరక్షణ అంటూ వేదికలపై పెద్ద ఎత్తున ఉపన్యాసాలు ఇస్తూ, ఉపవాసాలు చేసే సమాజం... క్షేత్రస్థాయిలో వాటి ప్రాణాలు తీస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని ఎందుకు అడ్డుకోలేకపోతోంది? ప్లాస్టిక్ నివారణకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయి. సింగిల్ యూజ్ (ఒకసారి వాడి పారేసే) ప్లాస్టిక్‌పై నిషేధాలు విధించాయి. కానీ, స్థానిక సంస్థల పర్యవేక్షణా లోపం, కఠినమైన జరిమానాలు లేకపోవడం వల్ల ఈ చట్టాలు కాగితాలకే పరిమితమయ్యాయి. వ్యాపా రులు గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేస్తూనే ఉన్నారు, ప్రజలు వాడుతూనే ఉన్నారు.

**'ది ప్లాస్టిక్ కౌ' ప్రాజెక్ట్...**

భారతదేశంలో ఆవులను పొట్టనబెట్టుకుంటున్న ప్లాస్టిక్‌పై అవగాహన పెంచడానికి కరుణ సొసైటీ వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా 'ది ప్లాస్టిక్ కౌ ప్రాజెక్ట్'ను చేపట్టాయి. వారు ఇప్పటి వరకు వందలాది ఆవులకు శస్త్రచికిత్సలు చేసి ప్లాస్టిక్‌ను తొలగించారు. దీనిపై 'ది ప్లాస్టిక్ కౌ' పేరుతో ఒక డాక్యుమెంటరీ కూడా వచ్చింది. దేశంలో కసాయిల చేతిలో చనిపోయే ఆవుల కంటే, మనం రోడ్లపై పారేసే ప్లాస్టిక్ తిని చనిపోయే ఆవుల సంఖ్యే ఎక్కువగా ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**ఏడాదికి వెయ్యి గోవుల మృత్యువాత...**

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పశువైద్య శాఖ, జంతు సంక్షేమ సంస్థల నివేదికల ప్రకారం, కేవలం లక్నో నగరంలోనే ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ప్రతీ సంవత్సరం దాదాపు 1,000 ఆవులు అత్యంత బాధాకరమైన స్థితిలో మరణిస్తున్నాయి. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ ఒక వెటర్నరీ అధికారి అంచనా ప్రకారం, ఇక్కడ కూడా ప్లాస్టిక్ మింగడం వల్లే ఏటా దాదాపు 1,000 ఆవులు మృత్యువాత పడుతున్నాయి. హైదరాబాద్, ఢిల్లీ, నోయిడా నగరాల డేటా ప్రకారం, నగరాల్లోని ఓపెన్ డస్ట్ బిన్లు, చెత్తకుప్పల వద్ద తిరిగే వీధి ఆవులలో అత్యధిక శాతం ప్లాస్టిక్ ఉచ్చులో చిక్కుకుంటున్నాయి. దాదాపు అన్ని వీధి ఆవుల మరణాలకు ప్లాస్టిక్ ప్రధాన కారణం అవుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ చట్టాల కంటే ప్రజల్లో స్వచ్ఛంద మార్పు రానంత వరకు ఈ మూగజీవాల ఆక్రందనలు ఆపడం ఎవరికీ సాధ్యం కాదు. ప్రతి ఇంటి నుండి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలి. ఇంట్లో తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయడం ప్రాథమిక నైతిక బాధ్యతగా ప్రతి పౌరుడు గుర్తించాలి. మిగిలిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ కవర్లలో కట్టి పారేయకూడదు. బజారుకు వెళ్లేటప్పుడు పాతతరం లాగా బట్ట సంచి లేదా జనపనార సంచిని వెంట తీసుకెళ్లడం గౌరవంగా భావించాలి. గోమాతను కేవలం గుళ్లలోనే కాదు, రోడ్లపైనా కాపాడుకుందాం. మూగజీవాల పొట్టనబెట్టుకుంటున్న ప్లాస్టిక్ సంస్కృతికి చరమగీతం పాడుదాం. పర్యావరణాన్ని, గోసంపదను కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును మనం కాపాడుకోవడమే అని గ్రహిద్దాం.

# మోడీ ఆధ్వర్యంలో దేశం అన్ని రకాల అభివృద్ధి.

- 12 ఏళ్లలో అనేక పథకాలు.
- చారిత్రాత్మక నిర్ణయాలు.
- మోడీ పరిపాలనకు బీజేపీ కృతజ్ఞతలు.
- రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు...

**రామాయంపేట, జూన్ 11 (సిరి న్యూస్)**



దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, అభివృద్ధి మరియు సంక్షేమ పాలనతో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రులలో అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగిన నాయకుల జాబితాలో మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించి 4,399 రోజుల పరిపాలన పూర్తి చేసినట్లు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తెలిపారు. ఆయనతో పాటుగా భారతీయ జనతా పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.2014లో ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోడీ గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తూ అనేక సంస్కరణలు చేపట్టారని పేర్కొన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, జన్ ధన్ యోజన, అటల్ బీమా పథకం, ఉజ్వల యోజన ద్వారా పేద మహిళలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రత, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సదుపాయాలు, సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రోత్సాహం, పేదల గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం, దేశవ్యాప్తంగా విద్యుత్ సౌకర్యాల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణం, పేద పిల్లలకు ఉచిత టీకాలు, జీఎస్టీ అమలు, ఆర్టికల్ 370 రద్దు వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని రాగి రాములు తెలిపారు.దేశంలోని చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా "సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్ – సబ్ కా విశ్వాస్ – సబ్ కా ప్రయాస్" అనే సిద్ధాంతంతో మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దిశగా ప్రధానమంత్రి మోడీ నాయకత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట పట్టణ బిజెపి అధ్యక్షులు అవినాష్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య, యాదగిరి, దంతపల్లి సర్పంచ్ బాలరాజ్, రాయిలాపూర్ ఉప సర్పంచ్ ప్రశాంత్, రామాయంపేట మున్సిపల్ పట్టణ కౌన్సిలర్ శంకర్ గౌడ్, ప్రెసిడెంట్ కన్నయ్య, నాగరాజు, అనిల్, ఓబీసీ మోర్చా నాయకులు రాజేంద్ర ప్రసాద్, చింతల శేఖర్, మండల మాజీ అధ్యక్షుడు దయానంద రెడ్డి, రామాయంపేట పట్టణ మాజీ అధ్యక్షులు భానుచందర్, యువజన నాయకుడు మరుకు వెంకటి, సీనియర్ నాయకులు దోమకొండ రాములు, నందిగామ నవీన్, బీసీ కాలనీ నాయకుడు అరుణ్, యాదగిరి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సాదుల నాగరాజు, సోషల్ మీడియా మండల నాయకుడు శేఖర్, అక్కన్నపేట రాగి అనిల్ కుమార్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఘన వ్యర్థాల నియమాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను సమర్థవంతంగా అమలు చేసి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, కాల్చడం వంటి చర్యలను అరికట్టాలని ఆదేశించారు. భారీగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే అపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు, ఫంక్షన్ హాళ్లను గుర్తించి, నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలని, కొత్త మున్సిపాలిటీలు, పంచాయతీలలో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు భూసేకరణ జరపాలని సూచించారు. ఇదే సమయంలో మున్సిపాలిటీల ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను వసూళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కోసం కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన బట్ట సంచులను అదనపు కలెక్టర్ పాండుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.



## ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాలలో తూప్రాన్ గీతా జూనియర్ కళాశాలవిద్యార్థులు

**ఉత్తమ మార్కులతో సత్తా చాటారు**






**తూప్రాన్ జూన్ 11 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని గీతా జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులతో సత్తా చాటారు.గురువారం విడుదలైన ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఇంప్రూమెంట్ ఫలితాలలో తూప్రాన్ గీతా జూనియర్ కళాశాల విద్యార్థులు ఎం. పి. సి. విభాగంలో కె. శ్రీనిధి 470 కి గాను 468 మార్కులు..ఎం. దివిజ మెహజబీన్ కౌసర్ ఇరువురు బై. పి. సి. విభాగంలో 440 మార్కులకు గాను 437 సి. ఇ. సి. విభాగంలో డి. జాషువా 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ టి. రాజు తెలిపారు ఈ సందర్భంగా కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు చైర్ పర్సన్ పి. ఉష డైరెక్టర్లు భరత్, డాక్టర్ మౌనిక, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సుధా రాణి, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు

## డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**పరమేశ్ యాదవ్**

**HMWS డీజీఎంకు బీఆర్ఎస్ నేతల వినతి**




**రామచంద్రాపురం, జూన్ 11 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను తక్షణం పరిష్కరించాలని HMWS&SB డిప్యూటీ జనరల్ మేనేజర్ శివను కలిసి బీఆర్ఎస్ పార్టీ పటాన్చెరు సర్కిల్ అధ్యక్షులు పరమేశ్ యాదవ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరమేశ్ యాదవ్ మాట్లాడుతూ, రామచంద్రాపురం డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు తీవ్రమయ్యాయని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇది ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బల్ల నర్సింగ్ రావు, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఫోర్స్‌లో ఎయిర్ మెన్‌గా ఎంపికైన పోలీస్ దిలీప్

**జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందనలు.**




**రామాయంపేట,జూన్ 11 (సిరి న్యూస్) రామాయంపేట మండలం**

అక్కన్నపేట గ్రామానికి చెందిన పోలీస్ దిలీప్ అగ్నివీర్ పథకం ద్వారా భారత వైమానిక దళం (ఎయిర్ ఫోర్స్)లో ఎయిర్‌మెన్‌గా ఎంపికైన సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఎయిర్‌మెన్ ఎంపికలో 7వ ర్యాంకు సాధించిన దిలీప్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో భారత వైమానిక దళంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసి మరింత ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. యువతలో చాలామంది వ్యసనాలకు అలవాటుపడి తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని, అలాంటి వారికి దిలీప్ ఆదర్శంగా నిలుస్తాడని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని దిలీప్ నిరూపించాడన్నారు. దిలీప్ సాధించిన విజయం అక్కన్నపేట గ్రామంతో పాటు మెదక్ జిల్లాకు గర్వకారణమని, మరెందరో యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉందని ఎస్పీ తెలిపారు. దిలీప్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆదర్శ మార్కెట్ దిశగా పటాన్చెరు అడుగు..




- రూ.20.46 కోట్లతో 172 దుకాణాల నిర్మాణం
- మేకల మండి, చేపల మార్కెట్ ఏర్పాటుకు ప్రణాళికలు
- ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యం
- సమగ్ర అభివృద్ధి దిశగా

**మార్కెట్ రూపాంతరం**

**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 11 (సిరి న్యూస్):**

పటాన్చెరు వ్యవసాయ మార్కెట్‌ను తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.గురువారం ఆయన మార్కెట్ యార్డును పరిశీలించి జరుగుతున్న నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.20 కోట్ల 46 లక్షల అంచనా వ్యయంతో 172 దుకాణాల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి వ్యాపారులకు అందజేస్తామని తెలిపారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేకల మండి, చేపల మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆధునిక స్లాటర్ హౌస్‌తో పాటు ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.మార్కెట్‌లో పరిశుభ్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.మార్కెట్‌ను సమగ్ర అభివృద్ధితో తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# పరిశోధనాభివృద్ధికి గీతం వినూత్న అడుగు..

- మెంటరింగ్ ఆధారిత కార్యక్రమం ప్రారంభం

**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 11 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడంతో పాటు విద్యాపరమైన శ్రేష్ఠతను పెంపొందించేందుకు 'మెంటరింగ్ ద్వారా గీతం పరిశోధనలో శ్రేష్ఠత' పేరుతో వ్యూహాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించింది. నిపుణుల మార్గదర్శకత్వం, విజ్ఞాన భాగస్వామ్య సమావేశాల ద్వారా పరిశోధన నైపుణ్యాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వ్యూహాత్మక కార్యక్రమాల డైరెక్టర్ డాక్టర్ మంజుల రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా గీతంలోని ఓరల్ పాథాలజీ, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ హైందవి బల్లా జూన్ 18న సాయంత్రం 6 గంటలకు "వైద్య సాంకేతికత, బహుళ విభాగాల ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణ" అంశంపై తొలి ఆన్‌లైన్ ఉపన్యాసం ఇవ్వనున్నారు.వైద్యం, దంతవైద్యం, బయోమెడికల్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధస్సు, డిజిటల్ హెల్త్ టెక్నాలజీల సమన్వయంతో ఆరోగ్య సంరక్షణ రంగంలో వస్తున్న ఆవిష్కరణలపై ఈ ఉపన్యాసంలో చర్చించనున్నారు. పరిశోధన అధ్యాపకులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని నిపుణుల అనుభవాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయం ఆహ్వానించింది.కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ పరిశోధకురాలు ప్రొఫెసర్ సునీత హో మార్గదర్శకత్వంలో ఈ ఏడాది ప్రారంభంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని, గీతం ప్రాంగణాలన్నింటిలో అంతర్-విషయ, సహకారపూర్వక పరిశోధనలను ప్రోత్సహించడమే దీని ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY

# మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తేవాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ప్రతినిధి, మే11(సిరి న్యూస్)**




మెదక్ ఖి ల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు .గురువారం ఆమె మెదక్ ఖిల్లాను సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందుచ్చుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు.ప్రజా పాలనప్రగతిప్రణాళికకార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ ఇతర అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక కమిషనర్ వైనవీన్ తో మెదక్ ఖిల్లా ను సందర్శించారు..మెదక్ ఖిల్లపైన ఉన్న గజశాల, దర్వాజాలు,జైలును తదితర చారిత్రక అంశాలను కలెక్టర్ ప్రతిమ సింగ్ అడిగి తెలుసుకున్నారు.. మెదక్ ఖిల్ల పైన ఎక్కడ డ్యామేజ్ అయింది, ఎక్కడ శిథిలావస్థకు చేరింది అనే అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు..అందులో భాగంగా ఖిల్లా పైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.మెదక్ జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో మెదక్ ఖిల్లపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు.జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద నిధులు తీసుకొచ్చి మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు... మెదక్ ఖిల్లాపై లెదర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.రాబోవు రోజుల్లో ఖిల్లా పై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశం అని కొనియాడారు.మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్, మున్సిపల్ కౌన్సిలర్ బట్టి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**శివంపేట్ జూన్ 11(సిరి న్యూస్ )**



గురువారం శివంపేట మండల కేంద్రంలోని ఉసిరికపల్లి గ్రామంలో పోతరాజుల బాలేష్ అనే రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను ,సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులు సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ నేడు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వరి, కూరగాయలు, పండ్ల తోటలు మరియు ఇతర పంటలను పరిశీలించి రైతుతో ప్రత్యక్షంగా మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ,, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.రైతులు తయారు చేస్తున్న జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, సేంద్రియ కషాయాలు తదితర సహజ ఎరువులు తయారీ విధానాలను కలెక్టర్ పరిశీలించారు. పంటల ఎదుగుదల, దిగుబడి పరిస్థితులు, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మరింత ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ సేంద్రియ సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు), రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఆదర్శ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసి ఇతర రైతులకు ప్రేరణ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ధృవీకరణ (సర్టిఫికేషన్), బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సౌజన్య మరియు రైతులు పాల్గొన్నారు.



# భద్రత ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి.

- "అరైవ్ అలైవ్" రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమం
- రోడ్డు ప్రమాదాల నివారణలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం – 
- అదనపు డీజీపీ సంజయ్ కుమార్.
- ట్రాఫిక్ నిబంధనల అమలు తోనే ప్రమాదాల నివారణ సాధ్యం – ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.



**రామాయంపేట, (మాసాయిపేట)జూన్ 11 (సిరి న్యూస్ )**

ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నాడు మెదక్ జిల్లా మాసాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు డీజీపీ సంజయ్ కుమార్ (TGSP బెటాలియన్స్) హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు డీజీపీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రతపై సరైన అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.అలాగే ప్రతి తల్లి తన కుమారులు, కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు వెళ్లే ముందు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం, అతివేగంగా వాహనాలు నడపకపోవడం వంటి భద్రతా సూచనలు తప్పనిసరిగా గుర్తు చేయాలని అన్నారు. కుటుంబ సభ్యుల అవగాహన, పర్యవేక్షణ కూడా రోడ్డు ప్రమాదాల నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే ప్రభుత్వం, పోలీస్ శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. "అరైవ్ అలైవ్" సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు.తదనంతరం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. చివరగా గ్రామ సభలో పంచాయతీ మరియు మండల పరిధిలోని ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి, ట్రాఫిక్ నియమాల పాటనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తూప్రాన్ ఆర్డీఓ, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, సైదా, ఎస్ఐలు, గ్రామ సర్పంచ్, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చందాలు కట్ చేయడంలో వేగం...

- డిజిటల్ హెల్త్ కార్డుల జారీలో ఎందుకు జాప్యం?'
- జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య



**జోగిపేట జూన్ 11, (సిరి న్యూస్):**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని ప్రకటించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్S) ప్రస్తుతం తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి ప్రతీకగా మారిందని జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభులు అన్నారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేసారు. ఆరోగ్య భద్రత కల్పిస్తామని గొప్పగా ప్రకటించిన ప్రభుత్వం, ఆచరణలో మాత్రం లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. జూన్ 2వ తేదీ నుంచి కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల వేతనాలు, పెన్షన్ల నుంచి 1.5 శాతం చందాను మే నెల వేతనంలో ముందస్తుగా కోత విధించిన ప్రభుత్వం, వారికి అందించాల్సిన వైద్య సేవల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లక్షలాది కుటుంబాల ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఈ సమస్యను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి వెంటనే పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈహెచ్‌ఎస్ అమలుకు సంబంధించి ఇప్పటి వరకు సమగ్రమైన విధివిధానాలు, ఆసుపత్రుల వివరాలు ప్రకటించలేదని. ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య సమన్వయం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి చందాలు వసూలు చేయడంలో చూపిన వేగం, డిజిటల్ హెల్త్ కార్డులు, ఆరోగ్య సేవలు అందించడంలో ఎందుకు కనిపించడం లేదని ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. డిజిటల్ హెల్త్ కార్డుల జారీ పూర్తయ్యే వరకు పాత హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో చెల్లుబాటు అయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. నెట్వర్క్ ఆసుపత్రుల్లో నూటికి నూరు శాతం నగదు రహిత వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 2 తర్వాత సొంతంగా వైద్య ఖర్చులు భరించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు వెంటనే పూర్తి రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదని. ఇప్పటికైనా ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈహెచ్‌ఎస్‌ను సమర్థవంతంగా త్వరితగతిన అమలు చేయాలని మాణయ్య, ప్రభులు కోరారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న మెదక్

- ఇందిరమ్మ ఇంటి కల సాకారం..
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం
- 20, 21వ వార్డుల్లో కొత్త బోర్ల ప్రారంభం
- ప్రజల అవసరాలే అభివృద్ధికి కొలమానం
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



**మెదక్ ప్రతినిధి,జూన్11(సిరి న్యూస్)**

మెదక్ పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రజల ప్రాథమిక అవసరాల పరిష్కారమే లక్ష్యంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు వరుస అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒకవైపు పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చుతూ 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించగా, మరోవైపు 20, 21 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారంగా కొత్త బోర్లను ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు.గురువారం 18వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుల కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.20, 21వ వార్డుల్లో చాలా కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే స్పందించి కొత్త బోర్ల తవ్వకాలకు చర్యలు చేపట్టారు. ప్రారంభించిన బోర్ల ద్వారా వందలాది కుటుంబాలకు తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ జీవిత ధ్యేయమని ఎమ్మెల్యే రోహిత్ రావు స్పష్టం చేశారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని, ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదన్నారు.మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం, బోర్ల ప్రారంభ కార్యక్రమాల సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపుతున్న ప్రజాప్రతినిధిగా రోహిత్ రావు పేరు తెచ్చుకుంటున్నారని కొనియాడారు.

**అభివృద్ధి పథంలో మెదక్**

పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, సంక్షేమం–అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్,కౌన్సిలర్లు రాజమణి, మన్సురు, శశాంక్, తాహేర్, గౌస్ ఖురేషి, మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ నాయకులు భూపతి రాజ్ బొజ్జ పవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



# పంచాయతీ కార్యదర్శి వాణికి ఘన వీడ్కోలు



**మునిపల్లి, జూన్ 11 (సిరి న్యూస్)**

ఉద్యోగులకు బదిలీలు సహజమని, వారు విధి నిర్వహణలో అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని మేళాసంఘం గ్రామ సర్పంచ్ కుపనగారం లక్ష్మీ సంగమేశ్వర్ అన్నారు. బదిలీపై వెళుతున్న స్థానిక పంచాయతీ కార్యదర్శి చింతలగట్టు వాణికి ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి వాణి చేసిన సేవలను కొనియాడుతూ గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ బేగరి అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ సంగమేశ్వర్, నాయకులు ఖ్యాతం రవీందర్, మాణిక్యప్ప, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ



**జోగిపేట జూన్ 11 (సిరి న్యూస్ ):**

అందోలు–జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో లబ్దిదారులకు గురువారం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చెక్కులను మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఎ.చిట్టిబాబులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని షాదిముబారక్ పథకం కింద 13 మంది, కళ్యాణ లక్ష్మి పథకం కింద 28 మంది, మొత్తం 41 మంది లబ్దిదారులకు చెక్కులు మంజూరు అయ్యాయని అన్నారు. సామాన్య, పేద వర్గాలకు చెందిన కుటుంబాల ఆడపిల్లల వివాహలకు ఆర్థికంగా అండగా నిలువాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ప్రజాప్రభుత్వం పథకాలతో ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పట్లోళ్ల శ్రీనివాస్, కొశికె రాజశేఖర్, మర్రి‡ అరుణ కుమారీ, గడ్డం అరుణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు హెచ్ .ప్రదీప్‌గౌడ్, పట్లోళ్ల .ప్రవీణ్ కుమార్, అల్లె శ్రీకాంత్, పిట్ల లక్ష్మణ్, పి. దుర్గేష్, నాయకులు అనిల్ కుమార్, గూడెం నాగరాజ్, మెప్మా టీఎంసీ భిక్షపతి, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పాండు

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- రూ.1.04 లక్షల చెక్కును అందించిన 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు




**గుమ్మడిదల, జూన్ 11 (సిరి న్యూస్):**

చిన్ననాటి నుంచి కలిసి పెరిగి, ఒకే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న బాల్య మిత్రుడి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురైన సహ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమతో కలిసి 1998–99 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేసిన గుమ్మడిదల గ్రామానికి చెందిన రమేష్ (ఆర్ఎంపీ వైద్యుడు) కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు.అనారోగ్య కారణాలతో రమేష్ అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. జిన్నారం హైస్కూల్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన మిత్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయంగా విరాళాలను సేకరించారు. ఇలా పోగు చేసిన రూ.1.04 లక్షల ఆర్థిక సహాయాన్ని రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి తమతో కలిసి చదువుకున్న స్నేహితుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని తెలిపారు. అతని లేని లోటును ఎవరూ భర్తీ చేయలేరని, అయితే క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న కుటుంబానికి కొంతైనా ఆర్థిక ఊరట కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. స్నేహబంధం అనేది కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు అండగా నిలబడటంలోనే సార్థకమవుతుందని వారు అన్నారు. భవిష్యత్తులో కూడా రమేష్ కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్ గౌడ్, జయంత్, రామకృష్ణ, బాలా గౌడ్, రవీందర్, కొర్లకుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

## జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



## తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





## సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

## మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



## బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





## మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



## గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?




ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పుధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

## ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రోటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రోటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

## గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ లో చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

## కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చుట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

## బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

## ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణలు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

## చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

# ఆస్ట్రేలియా జట్టులోకి భారత్ సంతతి ఆటగాడు... 1964 తర్వాత ఇదే తొలిసారి!

- ఆస్ట్రేలియా టీ20 జట్టులోకి భారత సంతతి ఆల్ రౌండర్ నిఖిల్ చౌదరి
- బంగ్లాదేశ్ సిరీస్‌కు ట్రావిస్ హెడ్ స్థానంలో ఎంపిక
- బిగ్ బాష్ లీగ్, ఐపీఎల్‌లో మంచి ప్రదర్శనతో గుర్తింపు
- జూన్ 17 నుంచి బంగ్లాదేశ్‌తో ప్రారంభం కానున్న టీ20 సిరీస్


**అఖండ సూర్య :**

బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్‌కు దూరమైన స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ స్థానంలో భారత సంతతి ఆల్ రౌండర్ నిఖిల్ చౌదరిని ఎంపిక చేశారు. ఢిల్లీలో జన్మించిన నిఖిల్, తుది జట్టులో చోటు దక్కించుకుంటే... 1964 తర్వాత భారత్‌లో జన్మించి ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించిన తొలి భారత సంతతి పురుష క్రికెటర్‌గా 30 ఏళ్ల నిఖిల్ చౌదరి చరిత్ర సృష్టించనున్నాడు.

బంగ్లాదేశ్‌లోని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో నిఖిల్‌కు తుది జట్టులో అవకాశం దక్కవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మిచెల్ మార్ష్ సారథ్యంలోని ఈ జట్టులో ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లతో కలిసి నిఖిల్ స్పిన్ విభాగంలో కీలకం పాత్ర పోషించనున్నాడు.

లెగ్ స్పిన్‌తో పాటు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్న నిఖిల్ చౌదరి, దేశవాళీ మరియు ఫ్రాంచైజీ క్రికెట్‌లో నిలకడగా రాణించి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకున్నాడు. బిగ్ బాష్ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ తరపున, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అతను ఆడాడు. శుక్రవారం అతను జట్టుతో కలుస్తాడని క్రికెట్ ఆస్ట్రేలియా ధ్రువీకరించింది. జూన్ 17 నుంచి చట్టోగ్రామ్ వేదికగా ఈ టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

1996లో ఢిల్లీలో జన్మించిన నిఖిల్, సుమారు దశాబ్దం క్రితం తన కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అంతకు ముందు భారత్‌లో దేశవాళీ క్రికెట్ ఆడిన సమయంలో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు.



# చేజారిన హాఫ్ సెంచరీ.. మళ్లీ బౌన్సర్‌కే చిక్కిన వైభవ్ సూర్యవంశీ!

- ఆఫ్ఘనిస్థాన్-ఏతో మ్యాచ్‌లో 44 పరుగులు చేసిన వైభవ్
- దూకుడుగా ఆడిన యువ సంచలనం
- ఆఫ్‌స్టంప్ బయట బౌన్సర్‌కు చిక్కిన సూర్యవంశీ
- భారీ షాట్లకే పరిమితం కాదని నిరూపణ
- గ్యాప్‌లు వెతుక్కుంటూ చక్కటి టైమింగ్‌తో బౌండరీలు

**అఖండ సూర్య :**

వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించాడు. 'ఆఫ్ఘనిస్థాన్‌ఏ'తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 15 ఏళ్ల ఈ ఓపెనర్ కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ఔటయ్యాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే అర్ధ శతకానికి చేరువవుతున్న తరుణంలో ఓ బౌన్సర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు.

ఐపీఎల్ ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లు వైభవ్‌పై అమలు చేసిన వ్యూహాన్ని ఆఫ్ఘనిస్థాన్ కూడా అనుసరించింది. ఆఫ్‌స్టంప్ బయట బౌన్సర్ బంతులతో అతణ్ని పరీక్షించే ప్రయత్నం చేసింది. అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అదే ప్లాన్‌తో బౌలింగ్ చేశాడు. ముందుగా ఒకసారి ఎడ్జ్ రాబట్టిన అతడు, తర్వాత కూడా అదే ప్రాంతంలో బంతులు వేస్తూ వైభవ్‌ను దొరకబుచ్చుకునే ప్రయత్నం చేశాడు. చివరకు అదే జరిగింది. ఆఫ్‌స్టంప్ బయటకు వెళ్లిన బౌన్సర్‌ను ఆడబోయిన వైభవ్ బ్యాట్ అంచుకు తగిలి వికెట్‌కీపర్ చేతికి చిక్కాడు. ఔటైన వెంటనే తనపై తనకే కోపం వచ్చినట్లు అసహనాన్ని ప్రదర్శించాడు. అయితే ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ బ్యాటింగ్‌లో మరో కోణం కూడా కనిపించింది. తను కేవలం భారీ షాట్లకే పరిమితం కాదని నిరూపించాడు. ఆఫ్ఘన్ బౌలర్లు ఆఫ్‌సైడ్‌లో ఫీల్డర్లను పెంచినా అనవసరంగా షాట్లు ఆడకుండా గ్యాప్‌లు వెతుక్కుంటూ చక్కటి టైమింగ్‌తో బౌండరీలు సాధించాడు. ముఖ్యంగా కవర్ ప్రాంతంలో వైభవ్ ఆడిన కొన్ని షాట్లు ప్రత్యేకంగా నిలిచాయి. బంతి దగ్గరకు వచ్చే వరకు ఓపిగ్గా ఎదురుచూసి చివరి క్షణంలో గ్యాప్‌లోకి పంపించిన తీరు ఆకట్టుకుంది. హాఫ్ సెంచరీ చేయకపోయినా ఈ ఇన్నింగ్స్, వైభవ్ ఎంత వేగంగా నేర్చుకుంటున్నాడో చూపించింది. బౌలర్లు అతణ్ని అడ్డుకునేందుకు కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో అతడు కూడా తన ఆటలో కొత్త కోణాలను జోడిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



# ముగియనున్న శకం.. మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్‌లకు ఇదే ఆఖరి ప్రపంచకప్!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 పలువురు దిగ్గజాలకు చివరి టోర్నీ
- ఆఖరిసారి బరిలోకి దిగనున్న మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్ వంటి స్టార్స్
- 2022 విజేతగా నిలిచిన మెస్సీ టైటిల్ నిలబెట్టుకోవాలని ఆశ
- తన కెరీర్‌లో వరల్డ్ కప్ మాత్రమే గెలవని రొనాల్డోకు ఇది చివరి అవకాశం
- ఇదే తన చివరి ప్రపంచకప్ అని బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే ప్రకటన







**అఖండ సూర్య :**

ఫిఫా ప్రపంచకప్ 2026 ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. మరపురాని క్షణాలు, నాటకీయ ముగింపులతో అభిమానులను అలరించే ఈ మెగా టోర్నమెంట్, ఈసారి ఒక శకానికి ముగింపు పలకనుంది. కొన్ని దశాబ్దాలుగా ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏలిన ఎందరో దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్ కాబోతోంది. కోట్ల మందికి స్ఫూర్తినిచ్చిన ఈ తరం మేటి క్రీడాకారుల కెరీర్‌లో ఇది ఆఖరి అధ్యాయం కావచ్చు. వీరిలో కొందరు ఇప్పటికే ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడగా, మరికొందరు ఆ ఒక్క కల కోసం చివరిసారిగా పోరాడనున్నారు. ఈ నేపథ్యంలో, 2026 ప్రపంచకప్‌తో తమ కెరీర్‌కు ముగింపు పలకనున్న ఐదుగురు లెజెండరీ ఆటగాళ్లపై ఓ ప్రత్యేక కథనం.

**1. లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)**

2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించి, ఫుట్‌బాల్ చరిత్రలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్నాడు లియోనెల్ మెస్సీ. ఎనిమిది సార్లు బాలన్ డి'ఓర్ అవార్డు గెలుచుకున్న ఈ దిగ్గజ ఆటగాడికి బహుశా ఇదే చివరి ప్రపంచకప్ కానుంది. ఖతార్‌లో తన చిరకాల కలను నెరవేర్చుకున్న మెస్సీ, ఇప్పుడు మరో చారిత్రక ఘనతపై కన్నేశాడు. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా అర్జెంటీనాను నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం ఎలా సాగినా, ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా మెస్సీ స్థానం పదిలంగా ఉంటుంది.

**2. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్)**

రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తనదైన ముద్ర వేసిన క్రిస్టియానో రొనాల్డో, ఇప్పటికీ తన దేశానికి అతిపెద్ద స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. తన కెరీర్‌లో సాధించాల్సిన ట్రోఫీలన్నీ గెలిచినా, ప్రపంచకప్ మాత్రం అతనికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో, 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న రొనాల్డోకు తన కలను నెరవేర్చుకోవడానికి ఇది చివరి అవకాశం. ప్రపంచకప్ వేదికపై అతను ఆడే ప్రతి మ్యాచ్ ఆఖరిది కావచ్చనే భావనతోనే ఈ టోర్నీలో ఆడనున్నాడు.

**3. లూకా మోడ్రిచ్ (క్రొయేషియా)**

క్రొయేషియాను ఒక ఫుట్‌బాల్ శక్తిగా నిలబెట్టడంలో లూకా మోడ్రిచ్ పాత్ర కీలకం. 2018లో జట్టును ఫైనల్స్‌కు చేర్చడం నుంచి 2022లో మూడో స్థానంలో నిలపడం వరకు, క్లిష్ట సమయాల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఇప్పటికే 40 ఏళ్ల వయసులో ఉన్న మోడ్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు నాయకుడిగా, క్రియేటివ్ ఫోర్స్‌గా కొనసాగుతున్నాడు. 2026 ప్రపంచకప్‌లో జట్టును మరోసారి విజయపథంలో నడిపిస్తే, ఫుట్‌బాల్ చరిత్రలోని అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్లలో ఒకడైన అతనికి అది సరైన వీడ్కోలు అవుతుంది.

**4. థామస్ ముల్లర్ (జర్మనీ)**

2014లో ప్రపంచకప్ గెలిచిన జర్మనీ జట్టులో కీలక సభ్యుడైన థామస్ ముల్లర్, టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించడంలో సిద్ధహస్తుడు. తన తెలివైన ఆటతీరు, కదలికలతో దశాబ్దానికి పైగా అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఫుట్‌బాల్ అగ్రశ్రేణిలో తమ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్న జర్మనీకి, 36 ఏళ్ల ముల్లర్ అనుభవం ఎంతో కీలకం. ఈ టోర్నీతో తన కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలని అతను భావిస్తున్నాడు.

**5. నెయ్‌మార్ (బ్రెజిల్)**

బ్రెజిల్ స్టార్ ఫార్వర్డ్ నెయ్‌మార్, 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ఇప్పటికే సంకేతాలిచ్చాడు. ఫిఫా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అతని కెరీర్ ఫొటోలకు బదులిస్తూ, 'ది లాస్ట్ డ్యాన్స్'(ఇదే చివరిసారి) అని కామెంట్ చేశాడు. 128 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 79 గోల్స్‌తో బ్రెజిల్ తరపున ఆల్‌టైమ్ టాప్ స్కోరర్‌గా ఉన్న 34 ఏళ్ల నెయ్‌మార్, 2023 అక్టోబర్‌లో గాయపడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే, అతను జట్టులోకి తిరిగి చేరి, గత 24 ఏళ్లుగా ఆరో ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్న బ్రెజిల్ కలను నెరవేర్చాలని పట్టుదలతో ఉన్నాడు.

# గిల్‌కు రోహిత్, కోహ్లీ అండ ఉంటే వరల్డ్‌కప్‌లో భారత్‌కు తిరుగుండదు

- పెద్ద టోర్నీల్లో అనుభవం కీలకమని వ్యాఖ్య
- వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ గొప్ప రికార్డులు ఉన్నట్లు వెల్లడి
- గిల్‌పై ప్రశంసలు కురిపించిన కుంబ్లే
- కెప్టెన్సీ ప్రభావం బ్యాటింగ్‌పై లేదన్న కుంబ్లే



**అఖండ సూర్య :**

2027 వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్లు అండగా ఉంటే జట్టుకు మరింత బలం చేకూరుతుందని చెప్పాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం ఎంతో కీలకమని పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి పెట్టారు. వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని రైనా గుర్తు చేశాడు. 2019 వరల్డ్‌కప్‌లో రోహిత్ అత్యధిక పరుగులు సాధించగా, 2023 వరల్డ్‌కప్‌లో కోహ్లీ టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడని చెప్పాడు. ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన అనుభవం ఈ ఇద్దరి సొంతమని రైనా పేర్కొన్నాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

గిల్ తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టును నడిపించే అవకాశం ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో దోహదపడతాయని రైనా అన్నాడు. మైదానంలోనే కాకుండా బయట కూడా వారి అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని వివరించాడు. ఒత్తిడి ఎక్కువగా ఉండే టోర్నీల్లో ఇలాంటి సీనియర్లు మ్యాచ్ ఫలితాలను ప్రభావితం చేయగలరని పేర్కొన్నాడు.

మరోవైపు మాజీ కెప్టెన్, కోచ్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురిపించాడు. కెప్టెన్సీ బాధ్యతలు వచ్చినా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం పడలేదని చెప్పాడు. ఐపీఎల్‌లోనూ గిల్ బౌలర్లను సమర్థంగా బరిలోకి దించాడని, ఒత్తిడిని సమర్థంగా అధిగమించాడని కొనియాడాడు.

గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం మరో పెద్ద ప్లస్ పాయింట్ అని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో గిల్‌కు సహాయం లభిస్తుందని చెప్పాడు. అందుకే కెప్టెన్సీ భారం మొత్తం అతడిపై పడదని వ్యాఖ్యానించాడు.

# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌దే నంబర్1 స్థానం

- వార్షిక అప్‌డేట్ తర్వాత భారత్‌కు 118 పాయింట్లు
- రెండో స్థానంలో న్యూజిలాండ్
- ఇరు జట్ల మధ్య తగ్గిన అంతరం
- మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా
- ఐదో స్థానానికి దిగజారిన పాకిస్థాన్

**అఖండ సూర్య :**

ఐసీసీ విడుదల చేసిన తాజా పురుషుల వన్డే జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. వార్షిక అప్‌డేట్ తర్వాత కూడా టీమిండియా నంబర్1 స్థానంలో కొనసాగుతోంది. అయితే రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌తో పాయింట్ల తేడా మాత్రం కొంత తగ్గింది.

అప్‌డేట్‌కు ముందు భారత్‌కు 119 రేటింగ్ పాయింట్లు ఉండగా ఇప్పుడు 118 పాయింట్లకు చేరింది. మరోవైపు న్యూజిలాండ్‌కు రెండు పాయింట్లు పెరగడంతో ఆ జట్టు 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఇరు జట్ల మధ్య ఉన్న ఎనిమిది పాయింట్ల అంతరం ఇప్పుడు ఐదు పాయింట్లకు తగ్గింది.

ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా 109 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. టాప్ 10లో చోటుచేసుకున్న ప్రధాన మార్పు నాలుగో స్థానంలో కనిపించింది. సౌతాఫ్రికా 102 పాయింట్లతో ఒక స్థానం మెరుగుపరుచుకుంది. పాకిస్థాన్ 98 పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. ఇక దిగువ స్థానాల్లో కూడా కొన్ని




మార్పులు చోటుచేసుకున్నాయి. ఐర్లాండ్ 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. అమెరికా 13వ స్థానానికి ఎగబాకి, స్కాట్లాండ్‌ను అధిగమించింది.

వన్డేల్లో మాత్రమే కాదు. టీ20 అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో కూడా భారత్ అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. మరోవైపు టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా నంబర్1 స్థానంలో ఉంది. మహిళల వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియానే అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.